విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 07, నవంబర్ 2024

విడపనకల్లులో దొంగల హల్‌చల్ ..

విశాలాంధ్ర-విడవనకల్లు : ఉరవకొండ నియోజకవర్గంలోని విడపనకల్లు మండల కేంద్రంలో మంగళవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. అమృత, వెంకటేశ్వర ఫర్టిలైజర్ షాపులతో పాటు సమీపంలోనే జనరల్ స్టోర్ షాపుల తాళాలు పగులగొట్టి రూ.10 వేల నగదు రెండు సిగరెట్ బండలను ఎత్తుకెళ్లారు. మరికొన్ని షాపుల తాళాలను సైతం పగులగొట్టి నగదుకు ప్రయత్నించారు. ఈ సంఘటనపై విడపనకల్లు పోలీసులు కేసు నమోదు చేశారు.

అనిమేటర్స్ అసోసియేషన్ ఎన్నిక ..

విశాలాంధ్ర-రాప్తాడు: డ్వాక్రా మహిళా సంఘాల అనిమేటర్స్ అసోసియేషన్ కార్య వర్గాన్ని బుధవారం డీఆర్డీఏ కార్యాలయంలో నిర్వహించామని వెలుగు ఏపీఎం సునీత తెలిపారు. అధ్యక్షురాలిగా సి.లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా పసువుల భగవత్ ఎన్నికయ్యారన్నారు.

ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించండి

కలెక్టర్‌కు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రాజారెడ్డి వినతి

విశాలాంధ్ర-అనంతపురం: ఏఎన్ఎం వైద్య సేవలు చేసేవారికి అదనపు పనులు ఇవ్వడంపై, వారి సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఏఎన్ఎం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అనంతపురం కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌కి బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ జె రాజారెడ్డి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సెప్టెంబర్ 30, 24 న విడుదల చేసిన జి.ఓ నెంబర్. 124లో ఏఎన్ఎంల విధులు బాధ్యతలను స్పష్టంగా పేర్కొంది అన్నారు. ఏఎన్ఎంలు, కమ్యూ నిటీ హెల్త్ ఆఫీసర్స్ ఆశా వర్కర్లతో కలిసి, సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి పర్యవేక్షణలో పనిచేయాలని, అత్యవసర వైద్య సేవలను అందించేందుకు ఏఎన్ఎంలకు ఇతర పనులు అప్పగించరాదని పేర్కోవడం జరిగిందన్నారు. ప్రతి నెలా 1వ 2వ తేదీలలో పింఛన్లు పంపిణీ, హౌస్‌హెల్డ్ మ్యాపింగ్ ఎన్‌సిడిసిడి సర్వే వంటి విస్తృత విధులు అప్పగించడం వల్ల వైద్య సేవలను సమర్థవంతంగా అందించలేకపోతున్నారని తెలిపారు.

దీంతో వారి పై అధికారి మెమోలు ఇస్తున్నారని, వివరణ ఇవ్వని పక్షంలో తీవ్ర శిక్షలు విధిస్తామని హెచ్చరికలు చేయడంతో ఏఎన్ఎం సిబ్బందిలో ఆందోళన, ఒత్తిడి పెరుగుతోందన్నారు. జి.ఓ. సరైన విధంగా అమలు కాకపోతే, దానికి సరైన మార్గదర్శకా లను ఇవ్వాలని కోరారు. మా సేవలను సమర్థవంతంగా అందించు టకు వెంటనే సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం డిఎంహెచ్‌ఓకి వినతిపత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ గౌడ్ నగర కార్యదర్శి విజే కృష్ణుడు జిల్లా ఆఫీస్ బేరర్ రాజు, నగర అధ్యక్షులు జీ.చిరంజీవి, ఏఎన్ఎంలు రజిని, విజయ భారతి, రమాదేవి శకుంతల సైరాభాను తదితరులు పాల్గొన్నారు.

పీఏబీఆర్ సామర్థ్యం 11 టీఎంసీలకు పెంచేందుకు చర్యలు

కలెక్టర్ వినోద్ కుమార్

విశాలాంధ్ర-అనంతపురం : పీఏబీఆర్ రిజర్వాయర్ సామర్థ్యం 5 టీఎంసీల నుంచి 11 టీఎంసీలకు పెంపుదల చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. బుధవారం అనంతపురం నగరంలోని బుడ్డప్ప నగర్‌లో ఉన్న టిబి హెచ్.ఎల్.సి కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేసి, కూడేరు మండలంలోని పీఏబీఆర్ రిజర్వాయర్‌కు సంబంధించి పెండింగ్ భూసేకరణ, నిధులు, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని కూడేరు మండలంలో ఉన్న పీఏబీఆర్ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 5 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉండగా, పూర్తిస్థాయి నీటి నిలువ 11.10 టీఎంసీల సామర్థ్యానికి పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. పీఏబీఆర్ రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటి నిలువ 11.10 టీఎంసీల వరకు నీటిని నిల్వ చేయాలంటే ఇంకా మొత్తం 3,026 ఎకరాల భూ సేకరణ కావలసి ఉందన్నారు. ఇందుకు సంబంధించి మొత్తం నివేదికను తయారుచేసి అందజేయాలన్నారు. రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటి నిల్వ కోసం అవసరమైన భూసేకరణ వివరాలు, ఇప్పటివరకు ఎంత భూమి సేకరించారు, ఇంకా ఎంత భూమి సేకరించాల్సి ఉంది, ఎంత నిధులు అవసరమవుతాయి, అనేదానిపై ప్రతిపాదనలు తయారుచేసి వాటర్ రిసోర్స్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్ కి కలెక్టర్ నుంచి ఒక లేఖ పంపించాలన్నారు. ఇరిగేషన్ శాఖ నుంచి సాంకేతిక సమస్యలు ఎలా అధిగమించాలి, తదితర అంశాలపై అవసరమైన స్టడీ చేయాలన్నారు. సమావేశంలో కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంత బాబు, హెచ్.ఎల్.సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమేష్‌రెడ్డి, డిటి అనురాధ, సీనియర్ అసిస్టెంట్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

మలేరియా వ్యాధిని నిర్మూలిద్దాం..

విశాలాంధ్ర-శెట్టూరు: మలేరియా వ్యాధి నిర్మిద్దాం ఆరోగ్యని కాపాడుకుందామని డాక్టర్ తరుణ్ సాయి సూచించారు. ఖైరేవు గ్రామంలో బుధవారం మలేరియా, డెంగీ వ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహన నిర్వహించారు.డాక్టర్ తరుణ్ సాయి మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, ఇంటిపరిసరాల్లో నీరు నిలవకుండా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, సాయంత్రం పూట వేపాకు పొగ వేసుకోవాలని, దోమతెరలు వాడాలని సూచించారు. స్థానిక ఎస్సీ కాలనీలో కొన్ని ఇళ్ళల్లో తొట్టెల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి లార్వాలను నిర్మూలించారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓ శోభ లత, సూపర్వైజర్ లీలావతి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మౌనిక, ఏఎన్ఎం సుశీల మహిళా పోలీస్ విశాలాక్షి అంగన్వాడీ టీచర్స్ ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అత్యాచార నిందితులను శిక్షించాలి

విశాలాంధ్ర-ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చిన్న పిల్లలపై హత్యాచారాలు, మహిళలపై దాడులు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయని వీటిని అరికట్టాలని ఎంపీపీ సుబ్బర హేమలత డిమాండ్ చేశారు. అత్యాచారాలు చేసిన నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని ఇంతవరకు ఎలాంటి చర్యలు వారిపై తీసుకోలేదన్నారు. తిరుపతిలో మూడేళ్ల బాలికను అత్యాచారం చేసి చంపేశారు.. అదే తిరుపతిలో పదవ తరగతి మైనర్ బాలికపై ఇద్దరు యువకులు దాడి చేశారని.. సత్యసాయి జిల్లా సోమందేపల్లి వద్ద ఇటీవల కర్ణాటకకు చెందిన ఓ కుటుంబం పై ఐదు మంది అత్యాచారం చేసి దాడి చేశారని. రాప్తాడులో ఇటీవల వరిమడుగు, భోగినేపల్లి గ్రామాల్లో కూడా వైసీపీ సానుభూతిపరులైన మహిళలపై దాడులు చేశారు. హిందూపురం, చిలమత్తూరులో అత్తకోడలిపై అత్యాచారం చేశారని, ఆత్మకూరు మండలం బ్రాహ్మణ యాలేరు గ్రామంలో రెండు రోజుల క్రితం అర్ధరాత్రి మద్యం తాగి ఆడవారిపై అరాచకంగా దాడి చేసి చెప్పులతో కొట్టి, నల్లపూసల దండతెంపి హీనంగా ప్రవర్తించారన్నారు. మహిళలపై ఇన్ని అరాచకాలు, అన్యాయాలు జరుగుతున్న నిందితులను శిక్షించడం విషయంలో ప్రభుత్వం తీవ్ర వైఫల్యం చెందుతోందన్నారు. దిశా చట్టాన్ని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించి మహిళలకు రక్షణ కల్పించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నీలిమ, ఆత్మకూరు మేజర్ పంచాయితీ సర్పంచ్ వరలక్ష్మి పాల్గొన్నారు.

150 పని దినాలు కల్పించాలి ..

విశాలాంధ్ర-నార్పల : మండలంలో ఉపాధి హామీ కూలీలకు 150 రోజులు పని దినాలు కల్పించాలని బుధవారం పంచాయతీ కార్యాలయంలో జరిగిన ఉపాధి హామీ సభలో పలువురు ఉపాధిహామీ కూలీలు జడ్పిటిసి నాగరత్నమ్మ, సర్పంచ్ మనీలా సుప్రియ, ఈఓఆర్‌డి శైలజరాణి గ్రామ కార్యదర్శి శ్యామలకు వినతిపత్రం సమర్పించారు.కరువుతో రైతులు పొలాల్లో పనులు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. 100 రోజులు పనిదినాలు ఇప్పటికే చాలా మంది పూర్తి చేసుకున్నారని తెలిపారు. పనిదినాలు పెంచకుంటే కూలీలు ఇబ్బందులు పడతారని తెలిపారు.

వివాహానికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-శింగనమల: మండలంలోని తరిమెల గ్రామానికి చెందిననడమింటి నాగేంద్ర కుమార్తె నడిమింటి నందిని వివాహానికి తరిమెల వంశీ గోకుల్ రెడ్డి తరిమెల గ్రామ పంచాయతీ సర్పంచ్ బిల్లగండ్ల ఓబులేసు ద్వారా రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బిళ్ళగండ్ల ఓబులేసు మాట్లాడుతూ పేదల వివాహాలకు తరిమెల వంశీ గోకుల్‌రెడ్డి సహకారం అందించడం ఆనందదాయకంగా ఉందన్నారు.

చెర్లోపల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

విశాలాంధ్ర-రాప్తాడు: మండలంలోని ఎం.చెర్లోపల్లి గ్రామా న్ని ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో ఆదర్శంగా తీర్చిదిద్దు తామని టీడీపీ మం డల ఇంచార్జి ధర్మ వరపు మురళీ అన్నారు. మరూరు వద్ద ఉన్న 44వ జాతీయ రహదారి నుండి ఎం.చెర్లోపల్లి మీదుగా పాలవాయి గ్రామ సరిహద్దులోని కనగానపల్లి రహదారి వరకు రూ.4.96కోట్లతో తారురోడ్డు వేయడానికి బుధవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ పసుపుల లక్ష్మీదేవి, కన్వీనర్ పంపు కొండప్ప, ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి శ్రీనివాసులు, పీఆర్ అధికారులు రామచంద్రారెడ్డి, సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ నారా యణస్వామి పాల్గొన్నారు.

రేపు సింగేపల్లిలో విగ్రహాల ప్రతిష్ఠాపన

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: మండలంలోని సింగేపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన మారెమ్మ, సుంకులమ్మ దేవాలయాల్లో శుక్రవారం తెల్లవారుజామున రామకృష్ణస్వామి ఆధ్వర్యంలో సుంకులమ్మ, మారెమ్మ, అమ్మవారి విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు బుధవారం ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం ఉదయం అమ్మవారి విగ్రహాలను ఊరేగింపు నిర్వహించి గంగ జలాభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, భక్తులు వేలాదిగా పాల్గొనాలని కోరారు.

పవన్ కళ్యాణ్ వ్యాఖ్యల పట్ల అభ్యంతరం

విశాలాంధ్ర-ఉరవకొండ: రాష్ట్రంలో హోం శాఖ పని తీరు చాలా అధ్వానంగా ఉందని తనకే గనక హోమ్ శాఖ పగ్గాలు వచ్చి ఉంటే దాని పని వేరే విధంగా ఉండేదని పవన్ కళ్యాణ్ ఇటీవల మహిళ హోంమంత్రినీ ఉద్దేశించి మాట్లాడటం దళిత మంత్రిని అవమానించడమే అని ఈ వ్యాఖ్యలు ఇటు సమాజానికి ప్రభుత్వానికి కూడా సిగ్గుచేటని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజు అన్నారు. బుధవారం ఉరవకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ శాఖలో అవినీతి అక్రమాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని. ఇటీవల ఉపాధిహామీ పథకంలో లక్షల రూపాయలు రికవరీకి ఆదేశించినా ఇప్పటివరకు చర్యలే లేకపోవడం పవన్ చేతకాని తనానికి నిదర్శనం అన్నారు. ముందు నీ తప్పు సరిదిద్దుకొని వేరే వాళ్ళు తప్పులు ఎత్తి చూపిస్తే బాగుండేదని పేర్కొన్నారు.

ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి

▸ ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసి ప్రభాకర్‌రెడ్డి..

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని టైలర్స్ కాలనీ, విజయనగర్ కాలనీ, పద్మవాణి హై స్కూల్, 26, 27వ వార్డులలో బుధవారం ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసి ప్రభాకర్‌రెడ్డి పర్యటించారు. కాలనీలలోని సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలలో ఉన్న మురుగు నీటి సమస్య, త్రాగునీటి సమస్య, వీధిలైట్ల సమస్యలను త్వరగా పరిష్కరించాలని మున్సిపల్, సచివాలయ అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా ప్రజలు కూడా తమ ఇంటి చుట్టూ చెత్తాచెదారం వేయకుండా, మున్సిపల్ వాహనాలు వచ్చినప్పుడు చెత్త వెయ్యాలన్నారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ సబ్బి శివరామకృష్ణ, డిఈ, ఏఈ అధికారులు కౌన్సిలర్లు రేష్మ ప్రవీణ్, షేక్షావలి, కోటా సుశీలమ్మ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పదోన్నతులు షెడ్యూల్ మేరకు చేపట్టాలి- ఎస్‌టియు

విశాలాంధ్ర-జెఎన్టియుఏ : ప్రభుత్వం చేపట్టిన పురపాలక నగరపాలక ఉపాధ్యాయుల పదోన్నతులు షెడ్యూల్ మేరకు నిర్వహించాలని ఎస్టియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, రామాంజ నేయులు జిల్లా విద్యాశాఖాధికారి ప్రసాద్ బాబుకు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంవత్సర తర్వాత పురపాలక, నగరపాలక ఉపాధ్యా యుల పదోన్నతులను చేపట్టుతున్నందున ఆలస్యం లేకుండా జరపా లని, మొత్తం ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఆర్ డి ఎం ఏ పదోన్నతి ప్రక్రియలో ఎక్కడ రోస్టర్ ఆగిందో రికార్డులను పరిశీలించి కొనసాగించాలని, మేనేజ్మెంట్లో ఉపాధ్యాయులు ఎవరికైనా రోస్టర్ పాయింటు కేటాయించి ఉంటే వాటిని ఒక సంవత్సరం పైగా కాలం అయింది కాబట్టి రద్దు పరచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తనకు ప్రధాన కార్యదర్శి సూర్యుడు రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్ సీనియర్ నాయకులు అజయ్ కుమార్ నగర అధ్యక్షులు ప్రభాకర్, వన్నూరప్ప, మల్లికార్జున, యుగంధర్, మురళీకృష్ణ, విరుపాక్షి గౌడ్, రామకృష్ణ, నౌషద్, ఖలిముల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వలసల నివారణకే ఉపాధి

విశాలాంధ్ర-నార్పల : వలసలు నివారించేందుకు ఉపాధి హామీ పథకాన్ని కేంద్రం ప్రవేశపెట్టిందని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ నాగరత్నమ్మ అన్నారు. ఈ సందర్భంగా నాగరత్నమ్మ మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి పథకం అమలులోకి రాకముందు గ్రామీణ ప్రాంత ప్రజలు ఇతర జిల్లాలు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లేవారు. ఈ నేపథ్యంలో వలసలు నివారించేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని ప్రభుత్వం అమలు చేసిన తర్వాత వలసలు గణనీయంగా తగ్గాయి. ఈ పథకంలో సొంత గ్రామంలోనే పనులు కల్పించడం జరుగుతుంది. ఉపాధి పనులు గుర్తించేందుకు గ్రామపంచాయతీలో గ్రామసభలు నిర్వహించడం జరుగుతుంది. ఉపాధి పనులు 2024-25 వ సంవత్సరంలో గ్రామాల్లో నిర్వహించబోయే పనులు వాటి గురించి వివరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి శైలజ రాణి ఉపాధి హామీ ఏపీవోలు ఎర్రమ్మ, రమేష్ రామారావు ఈసీ సంగీత, టెక్నికల్ అసిస్టెంట్ హరినాథ్ రెడ్డిల పర్యవేక్షణలో ఆయా గ్రామాల కార్యదర్శులు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల గ్రామ ప్రజలతో గ్రామాల్లో ఉపాధి హామీ గ్రామసభలు నిర్వహించారు.

బచ్చనకాల్లేశ్వర ఆలయ ఆవరణలోకి ముంచెత్తుతున్న మురునీరు..!

విశాలాంధ్ర-కణేకల్లు: మండలంలోని హనకనహాల్ గ్రామంలో ఉన్న శ్రీ బచన కాల్లేశ్వర దేవాలయం ఆవరణలోకి గ్రామంలోకి చెందిన బాత్రూం నీళ్లు, మురికినీరు వదులుతున్నారని ఆలయ కమిటి సభ్యులు మండిపడుతున్నారు. ఈ విషయాన్ని ఇదివరకే స్పందన కార్యక్రమంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని దేవలయ కమిటీ వారు చెప్పారు. ఈ విషయాన్ని కలెక్టర్ పరిశీలించి పురావస్తు శాఖ వారిని పంపించి నిజానిజాలు తెలుసుకున్నారన్నారు. అప్పటి నుండి ఈ సమస్య ఎక్కడ ఉన్న గొంగళి అక్కడే ఉన్న చందంగా ఉందంటున్నారు. ఇటీవల కొందరు నాయకులు గ్రామంలోనికి ఎమ్మార్వోని, ఎస్ఐని, ఎంపీడీవోని, పిఆర్‌డిఓని పిలిపించి ఎలాగైనా మురికినీరును దేవాలయం ఆవరణలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరినా ఫలితం లేదు. ఇదివరకే రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులుకి కూడా విన్నవించారు. అయినా ఉద్దేశపూర్వకంగా దేవాలయానికి వచ్చు భక్తులను ఇబ్బంది పెట్టేందుకు రోడ్డుపైన, గుంతలు ఉండే విధంగా చేసి మురుగునీరును అందులో వదిలి దేవాలయం బయటకు మురుగు వెళ్లకుండా చేయడానికి కొందరు శాయశక్తులా ప్రయత్నం చేసి భక్తులను గ్రామంలో చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈ విషయంపై బుధవారం గ్రామంలోకి వచ్చిన అధికారులకు తెలియజేశామని, అయినా మా గోడును పట్టించుకునే నాధుడే కరువయ్యాడని ఆవేదనవ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించకుంటే ఈ సున్నితమైన అంశం ఎంతటికైనా దారితీస్తుందన్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బి అధికారులు ఎంపీడీవో, ఆర్డీవో, పంచాయతీరాజ్ డిపార్టుమెంట్ చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు.

చర్మకారుల సమస్యలు పరిష్కరించాలి..

చర్మకారుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు

ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ నిధిమీనా, తిరువూరు ఎమ్మెల్యే కులికిపూడి శ్రీనివాసరావుకు, ఎంపీ కేసినేని చిన్నికి వినతిపత్రం ఇస్తున్న రాజారావు

విశాలాంధ్ర-గుంతకల్లు: ఆంధ్రప్రదేశ్‌లో చర్మకారులు, డప్పు కళాకారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చర్మకారుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు రాష్ట్రంలో రెండు విడతలుగా 16 జిల్లాల్లో పర్యటించి ఆయా జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు డిఆర్‌ఓలను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఆయన రెండో విడతగా ఐదు జిల్లాల్లో పర్యటన ముగించుకొని మంగళగిరి నుంచి తిరిగి వచ్చిన ఆయన బుధవారం గుంతకల్లులో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో చర్మకారులు, డప్పు కళాకా రులు, చర్మ శుద్ధి కార్మికులు, కబేళ వృత్తిదారులకు జిల్లా ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ నుండి లక్ష రూపాయలు చొప్పున రుణం మంజూరు చేయాలని, లిడ్ క్యాప్‌కు 300 రూ.కోట్లు కేటాయించి, 300 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరినట్లు తెలిపారు. అలాగే రాష్ట్రంలో జిల్లాకు ఒకటి చొప్పున లెదర్ పార్కుల నిర్మాణం చేపట్టాలని, రాష్ట్రంలో ప్రతి మండల కేంద్రంలో చర్మ కారులకు చెప్పుల షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం జరపాలని తదితర సమస్యలను ఆయా జిల్లాలోని కలెక్టర్లు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.. రాష్ట్రంలో తొలివిడతగా 11 జిల్లాల్లో, రెండో విడతగా ప్రస్తుతం ఐదు జిల్లాల్లో పర్యటించారు. ఆయన వెంట సంఘం నాయకులు మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సాగు, తాగునీటి రంగాలకు బడ్జెట్లో నిధులు కేటాయించాలి..

విశాలాంధ్ర-రాప్తాడు: సాగు, తాగునీటి రంగాలకు బడ్జెట్లో నిధులు కేటాయించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. అనంతపురం రూరల్, రాప్తాడు మండల మహాసభలను బుధవారం రాప్తాడు ఆర్డీటీ స్కూల్లో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సావిత్రమ్మ, ఎం. బాలరంగయ్య హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఈనెల 8 నుండి 14వ తేదీ వరకు కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరగనున్న సిపిఎం నిరసన కార్యక్రమాల్లో జిల్లా ప్రజలు పాల్గొనాలన్నారు. అధిక ధరలు, నిత్యావసర సరుకులు, మహిళలు, చిన్నారులు, దళితులపై జరుగుతున్న అత్యాచారాలు దాడులు అరికట్టాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి, నిరుద్యోగ భృతి కల్పించాలన్నారు. పీఏబీఆర్ కుడికాలు నుండి 49 చెరువులకు సాగు, తాగునీరు ఇవ్వాలన్నారు. 2023 పంటల బీమా విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనంతపురం రూరల్, రాప్తాడు మండల కార్యదర్శులు టి.రామాంజనేయులు, ఎం.పోతులయ్య, మండల నాయకులు చంద్రిక, పుష్ప తిరుపాలు, రాయమ్మ రాజు, గోపాల్, ప్రకాష్, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

యాడికి నూతన ఎస్.ఐగా రమణ

విశాలాంధ్ర-యాడికి : స్థానిక యు.పి.ఎస్‌లో బుధవారం నూతన ఎస్సైగా రమణ పదవీ బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీలలో భాగంగా అనంతపురం వీఆర్ నుంచి బదిలీపై యాడికికి వచ్చినట్లు తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పర్యవేక్షణ చేస్తానని తెలిపారు.

నిరుపయోగ వస్తువులను టేబుల్స్, బెంచీలుగా రూపకల్పన..



విశాలాంధ్ర-జేఎన్టీయూఏ: జెఎన్టియు అనంతపురం విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం లోని నిరుపయోగకరంగా ఉన్న వస్తువులను వినియోగించుకుని, నూతన టేబుల్స్, బెంచీలుగా రూప ౕకల్పన చేసి వినియోగంలోకి ఉద్యో గులు తీసుకువచ్చారు. మెకానికల్ విభాగ అధిపతి కళ్యాణి రాధ, ఈ వర్క్‌షాపు ఇంచార్జ్ ఆఫీసర్ డాక్టర్ పి.ఓం ప్రకాష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చదువుకోడానికి వీలుగా అద్భుత ఆవిష్కరణలు చేపట్టారు. మెకానికల్ ఉద్యోగుల సహకారంతో మరెన్నో పరికరాలను రూపకల్పన చేస్తామన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.వసుంధర మెకానికల్ సిబ్బందిని అబినంధించారు. కార్యక్రమంలో మెకానికల్ ఆచార్య బి.చంద్ర మోహన్‌రెడ్డి, డాక్టర్ డి.ఆర్. శ్రీనివాసన్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర-పామిడి: పామిడి బిసిసి రోడ్డు సబ్ రిజిస్టర్ కార్యాలయం ప్రక్కన తోపుడు బండిపై చిన్నపాటి టీ హోటల్ పెట్టుకొని బ్రతుకు జీవనం సాగిస్తున్న మాబూ(50)ని శనివారం సాయంత్రం కల్లూరుకు చెందిన ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. బెంగు ళూరుకు తరలించగా అక్కడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడు తన మొదటి భార్యకు పక్షపాతం రావడంతో రెండోవివాహం చేసుకున్నాడు. మొదటి భార్యకు ఇద్దరు పిల్లలు రెండవ భార్యకు కుమారుడు కలదు. పేద కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

పీవీకేకే విద్యార్థులకు దిగ్గజ సంస్థల్లో ఉద్యోగాలు

విశాలాంధ్ర-జెఎన్టియుఏ: పివికెకె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మెకానికల్ ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న 10 మంది విద్యార్థులు పారిశ్రామిక దిగ్గజ సంస్థలైన రాయల్ ఎన్ఫీల్డ్, హీరో హోండా, టీవీఎస్‌లో ఉద్యోగ నియామకాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డా.బండి రమేష్‌బాబు పేర్కొన్నారు. కళాశాలలో ఉన్న శిక్షణా సౌకర్యాలు, పరిశ్రమలతో కళాశాల అనుసంధానం వంటి విధానాల వల్ల ఉజ్వల ఉపాధి కల్పన అందిస్తున్నామన్నారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ డాక్టర్ పల్లె కిషోర్, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రమేష్‌బాబు, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ బాల సుబ్రహ్మణ్యం అభినందనలు తెలిపారు.

హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

కార్పొరేట్ ఆఫీస్: 167-169, 2వ అంతస్తు, అన్నాసాలై, సైదాపేట్, చెన్నై-600 015, CIN U65922TN2015PLC10093, www.hindujahousingfinanace.com, బ్రాంచ్ కార్యాలయం: 51/12-12-ఇ3, 2వ అంతస్తు, తిలక్‌నగర్, రెవిన్యూ కాలనీ, వార్డ్ నం.51, విద్యుత్ భవన్ ఎదుట, ఆంధ్రాబ్యాంక్ పైన, కర్నూలు-518002

డిమాండ్ నోటీసు

మీరు, క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతలు మరియు హామీదారులు ఈ కింద వివరించినట్లుగా మీ యొక్క స్థిర ఆస్తి(లు)ని తనఖా పెట్టుట ద్వారా ఆస్తి సౌకర్యం(లు)పై హెచ్‌హెచ్‌ఎఫ్ఎల్ నుండి హోమ్‌లోన్/లోన్ వినియోగించుకున్నారు. ఈ మొత్తాలను తిరిగి చెల్లించడంలో విఫలమైనారు; మీ రుణాలు నిరర్ధక ఆస్తులుగా వర్గీకరించబడ్డాయి. బకాయి పడిన మొత్తాలను తిరిగి రాబట్టుకునేందుకు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 కింద చివరిగా తెలిసిన మీ యొక్క చిరునామాలకు పంపిన డిమాండ్ నోటీసు అందజేయబడక తిరిగి పంపబడినది. అందుచేత ప్రత్యామ్నాయ సర్వీసుగా ఈ నోటీసులోని అంశాలను సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిబంధనలు, 2002 నిబంధన 3(1)తో చదివే చట్టంలోని సెక్షన్ 13(2) కింద ఇచ్చట ప్రచురించబడుచున్నవి. రుణగ్రహీతలు, సహ-రుణగ్రహీతలు, హామీదారులు, సెక్యూరిటీలు, మొత్తం బకాయిలు, సెక్షన్ 13 (2) కింద పంపిన డిమాండ్ నోటీసు మరియు క్లెయిమ్ చేసిన మొత్తం మొదలైన వాటి వివరాలు ఈ కింద ఇవ్వబడ్డాయి :

క్ర.సం.	రుణగ్రహీత, సహ-రుణగ్రహీత/హామీదారు పేరు/ రుణఖాతా నం.	ఎన్‌పిఏ తేదీ	డిమాండ్ నోటీసు తేదీ & బకాయి మొత్తం
1	"1. శ్రీ రేనాటి రామచంద్రారెడ్డి తండ్రి ఆర్. శ్రీరామిరెడ్డి (రుణగ్రహీత), 2. శ్రీమతి రేనాటి ప్రభావతి భర్త రేనాటి రామచంద్రారెడ్డి (సహ-రుణగ్రహీత). ఇద్దరూ నివసించునది: ఆర్/ఓ. హెచ్.నం: 2-411, ముత్తాల (వి), పంపల్లి, ఆత్మకూరు (ఎం), అనంతపురం జిల్లా, పిన్‌కోడ్-515751. అప్లికేషన్ నం.లు: AP/ANP/ANPR/A000000104"	06.08.2024	02.11.2024 & తేదీ :01.11.2024 నాటికి వడ్డీతో పాటు రూ.9,19,317/- (తొమ్మిది లక్షల పంతొమ్మిది వేల మూడువందల పదిహేడు రూపాయలు మాత్రమే)
	ఆసక్తి సృష్టించబడిన హామీగా పెట్టిన ఆస్తి వివరాలు: - "అనంతపురం జిల్లా, అనంతపురం ఆర్.డి, అనంతపురం రూరల్ ఎస్.ఆర్.డి , ఆత్మకూరు మండలం, ముత్తాల పంచాయతీ ఏరియా, గోరిదిండ్ల పరిధిలో ఉన్న ఆస్తి బాబు వివరం సర్వే నం: సర్కారు కుప్పి 136 పైకి. ఎ.సి: 0.02.75, హెచ్.ఎస్: 0.011, డోర్ నం: 02-41, అసెస్‌మెంట్ నం: 498. హద్దులు: తూర్పు: చంద్రశేఖర్ రెడ్డి ఇల్లు, దక్షిణం: పోతులయ్య ఇల్లు, పడమర: గోవిందు ఇల్లు, ఉత్తరం: రోడ్డు. ఇంటి కొలతలు: తూర్పు-పడమర: 20 అంగు లేదా 6.09 మీటర్లు, ఉత్తరం-దక్షిణం: 60 అంగు లేదా 18.28 మీటర్లు"		

చట్టంలోని సెక్షన్ 13(2) కింద నోటీసు జారీ చేసిన తేదీ నుండి 60 రోజుల వ్యవధిలో మొత్తం బాకీ చెల్లించవలసిందిగా పై రుణగ్రహీత/లుకు సూచించడమైనది. విఫలమైన పక్షంలో సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క నిబంధనల ప్రకారం పైన ప్రస్తావించిన 13 (2) సెక్షన్ కింద జారీ చేసిన నోటీసు తేదీ నుండి 60 రోజుల గడువు ముగిసిన పిమ్మట తదుపరి చర్యలు తీసుకోబడునని తెలియచేయడమైనది.

తేదీ : 07.11.2024, ప్రదేశము : అనంతపురం
సం/- అధీకృత అధికారి, హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com కర్నూలు, గురువారం 07, నవంబర్ 2024

ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించి కరువు పనులు ప్రారంభించాలి

సిపిఐ నాయకులు

విశాలాంధ్ర-ముదిగుబ్బ: ముదిగుబ్బ మండలంలో కరువు పనులను పునఃప్రారంభించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ముదిగుబ్బ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన గ్రామసభలో ఎన్డీఏ కూటమి నాయకులకు, అధికారులకు సిపిఐ నాయకులు వినతిపత్రం అందించారు, పార్టీ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు ఆధ్వర్యంలో గ్రామసభలో టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్, బిజెపి మండల కన్వీనర్ సోమల ప్రకాశ నాయుడుతో పాటు స్థానిక పంచాయతీ అధికారి మంజులాదేవి, సర్పంచ్ లక్ష్మీదేవి లను కలిసి, ఫీల్డ్ అసిస్టెంట్లు నియామకం గురించి ప్రత్యక్షంగా సమస్యలను వివరించారు, నూతన ప్రభుత్వం ఏర్పడి సుమారు 6 నెలలు అవుతున్న ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవడంతో ఉపాధి కూలీలకు పని లేక పేద ప్రజలు వలసల బాట పడుతున్నారని తెలిపారు. ఈ మండలాన్ని కరువు ప్రాంతంగా గుర్తించిన నేపథ్యంలో తక్షణమే ఫీల్డ్ అసిస్టెంట్ నియామకం జరిపి కరువు పనులు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా కస్తూరిబాయ్ స్కూల్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ అధికారి మంజులా దేవికి వినతిపత్రం ద్వారా విన్నవించారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు డాబా రామకృష్ణ, సిపిఐ స్థానిక నాయకులు గుంజేపల్లి కృష్ణయ్య, రాధాకృష్ణ, ఆదినారాయణ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉచిత ఇసుక సరఫరా అమలు చేస్తాం

- కలెక్టర్ టిఎస్ చేతన్

విశాలాంధ్ర-పుట్టపర్తి : జిల్లాలో ఉచిత ఇసుక సరఫరా పారదర్శకంగా అమలు చేస్తామని వినియోగదారులు ట్రాక్టర్లలో ఎద్దుల బండ్లు లో కూడా తీసుకు వెళ్ళవచ్చు అని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్లో ఉచిత ఇసుక అమలుపై కలెక్టర్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రత్న, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, జిల్లా గనుల శాఖ అధికారి పెద్దిరెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఇసుక బుకింగ్ ను నమోదు చేయడానికి సిబ్బం దికి తగిన శిక్షణ ఇవ్వాలని తెలిపారు. సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ లేదా పంచాయతీ కార్యదర్శి ఇసుక బుకింగ్ రిజిస్ట్రేషన్ కోసం వారికి తగిన బాధ్యతలు అప్పగించాలని తెలిపారు. ఉచిత బుకింగ్ నమోదు కోసం సంబంధిత మండ లాల తహసిల్దారులు, ఎంపీడీవోలు, పోలీస్ శాఖ పర్యవేక్షణలో కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. బుకింగ్ చేసుకున్న తర్వాత వినియోగదారులకు ఒకరోజు ముందుగానే సరఫరా చేసుకోవచ్చని తెలపవలసిన బాధ్యత అధికారులపై ఉంటుందన్నారు. వినియోగదారులకు నాణ్యమైన ఇసుక సరఫరా చేయాలని అందుకు పూర్తి బాధ్యత మైనింగ్ శాఖ అధికారులదే అన్నారు. నదీ పరివాహక ప్రాంతాలలో పరిధిలో ఉన్న గ్రామాల వినియోగదారులు ఇసుకను తీసుకు వెళ్ళవచ్చు అన్నారు. ప్రస్తుతం ఎద్దుల బండ్లు, ట్రాక్టర్ల ద్వారా వినియోగ దారులు ఇసుక తీసుకుని వెళ్లడానికి ప్రభుత్వం అనుమతించిం దన్నారు. ఇకపై భారీ యంత్రాల ద్వారా ఇసుక రవాణా అనుమ తించబడుతున్నారు. ఇసుక రవాణా చేసే అన్ని వాహనాలు ఉచిత ఇసుక రవాణా వాహనం అనే బ్యానర్లను కలిగి ఉండాలన్నారు. ఇసుక సరఫరా నోడల్ అధికారిగా జాయింట్ కలెక్టర్‌ను నియమించామని, కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్, హెల్ప్ లైన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాస్థాయి టాస్క్ ఫోర్స్, వివిధ శాఖల నుంచి టీంను ఏర్పాటు చేశామని వారు ఆకస్మిక తనిఖీలు చేసే అధికారం ఉందన్నారు. ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా, నిల్వ, బ్లాక్ మార్కెటింగ్ పై రోజువారిగా కేసులు రిజిస్టర్ చేయడం జరుగుతుందన్నారు. ఎన్ఫోర్స్మెంట్ మరింత బలోపేతం చేస్తామన్నారు. మండల స్థాయిలో ఎస్ హెచ్ ఓ, తహసిల్దార్ సమన్వయంతో పనిచేయడం జరుగుతుందని జిల్లా స్థాయిలో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డయల్ 100,102కి ఫోన్ చేసి ఎక్కడైనా ఇసుక తవ్వకాలు, లేదా రవాణా జరుగుతుంటే ఫిర్యాదు చేయవచ్చని అటువంటి ఫిర్యాదులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇసుక డెలివరీ అడ్రస్ పై మానిటర్ చేస్తామన్నారు. రిజిస్ట్రేషన్, బ్యానర్, జిపిఎస్ లేకుండా ఇసుక రవాణా చేసే ఏ వాహనాలనైనా బ్లాక్ లిస్ట్‌లో ఉంచుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిఓ, కరుణ సాగర్ రెడ్డి, జల వనరుల శాఖ అధికారి మల్లికార్జునయ్య, ధర్మవరం ఆర్డీవో మహేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రీ సర్వేలో సబ్ డివిజన్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి : డీఏఓ

విశాలాంధ్ర-ధర్మవరం: రీ సర్వేలో సబ్ డివిజన్ పరిధి లోని దరఖాస్తులు అన్నింటినీ వెంటనే పరిష్కరించాలని డిఏఓ కతిజూన్ కుబ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం ఆర్డీవో మహేష్ ఆదేశాల మేరకు డివిజన్లోని మండల తాసిల్దారులు, మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లతో సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం కతిజున్ కుబ్రా మాట్లాడుతూ కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారి మహేష్ ఆదేశాల మేరకు రీ సర్వే పూర్తి అయిన వివరాలను వెను వెంటనే పంపాలని తెలిపారు. ఎఫ్ లైన్స్, పట్టా సబ్ డివిజన్స్, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన అర్జీలు, సర్వీస్ లెవెల్ అగ్రిమెంటులోపు పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా రీ సర్వే గ్రామసభలలో వచ్చిన అర్జీలకు నోటీసులను వెంటనే జారీచేసి, పొలము వద్ద హాజరైన పట్టాదారుల అందరి అంగీకరణతో నివేదికను తీసుకొని, మండల సర్వేయర్లు, తాసిల్దార్ల లాగిన్‌లో నుండి సర్వే భూమి రికార్డుల అధికారి పుట్టపర్తి వారికి పంపి వారితో అంగీకారం తీసుకోవాలని తెలిపారు. అనంతరం ఎల్‌పిఎం కరెక్షన్ మోడ్యూల్ ద్వారా పూర్తి చేసి రీ సర్వే జరిగిన గ్రామాలలో రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు. రీ సర్వే గ్రామసభల్లో జాయింట్ ఎల్పీ ఏములు కేటాయించిన రైతులు దాఖలు చేసిన సబ్ డివిజన్ దరఖాస్తులు వెనువెంటనే పరిష్కరించాలని తెలిపారు. శిక్షణ సమావేశంలో ఏడు మండలాల తాసిల్దార్లు, డివిజనల్ ఇన్స్పెక్టర్లు అంజలీదేవి, మురళీ కృష్ణ, శామ్యూల్ బాబు, అన్ని మండలాల మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లు, మాస్టర్ ట్రైనర్స్, పరిగి మండల డిప్యూటీ సర్వేయర్ కవిత పాల్గొన్నారు.

8న పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా



విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 8వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పాలిటెక్నిక్ కళాశాల జేవి. సురేష్ బాబు, ఏపీఎస్ఎస్డిసి జిల్లా నైపుణ్య అధికారి బి.హరికృష్ణ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువతీ యువకుల కోసం ఈ జాబ్ మేళా కార్యక్రమాన్ని ఉదయం 9 గంటలకు ఏర్పాటు చేశామన్నారు. రెండు కంపెనీలు ఉద్యోగ మేళాలో పాల్గొంటాయని, పదవ తరగతి, ఇంటర్, డిప్లమా, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ పూర్తి చేసి, 18 నుంచి 30 సంవత్సరాలలోపు ఉన్న వారు మాత్రమే అర్హులని తెలిపారు. నెలకు రూ.15వేల నుండి రూ.25 వేల వరకు జీతం ఉంటుందని తెలిపారు. జాబ్ మేళాలో ఎంపికైన వారు అనంతపురం, బెంగళూరులో ఉద్యోగం చేయాల్సి ఉంటుం దన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు ఆధార్ కార్డు విద్యా అర్హత పత్రాలు తేవాలన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 9182288465కు సంప్రదించాలని తెలిపారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర-పెనుకొండ: పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జయప్ప ఆధ్వర్యంలో పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా పెనుకొండ ఎస్సై వెంకటేశ్వర్లు పాల్గొని సైబర్ క్రైమ్, మహిళలు, చిన్న పిల్లలపై దాడులు, మత్తు పదార్థాలు రోడ్డు రవాణా, సంబంధిత చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత చట్టాలు అన్నింటిని సక్రమంగా పాటించి రాష్ట్ర అభివృద్ధి తద్వారా దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పెరుగుతున్న క్రైమ్‌కు కారణం గంజాయి మత్తు పదార్థాలకు బానిసలు కావడమే అన్నారు.

ఆధార్ అవస్థలు తీర్చండి : సిపిఐ

విశాలాంధ్ర-ఓబుళదేవరచెరువు: మండల కేంద్రంలో ఆధార్ అప్డేట్ ఇతర వివరాల నమోదుకు ఆధార్ కేంద్రం లేకపోవడంతో మండల ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్య పరిష్కరించాలని సిపిఐ నాయకులు తహసీల్దార్ అనంతాచారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజక వర్గ కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ... ఆధార్‌లో వివిధ రకాల వివరాల మార్పులు చేర్పులు కోసం ప్రజలు నిత్యం మండల కేంద్రంలోని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, ఆధార్ సెంటర్ అందుబాటులో లేకపోవడంతో ప్రజలు కదిరికి పోవాల్సి వస్తోందన్నారు. వెంటనే పాఠశాలలో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చలపతి, సహాకార్యదర్శి సుధాకర్, గంగులప్ప, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి రెవెన్యూ గ్రామసభలు

విశాలాంధ్ర-అగళి : రెవెన్యూ సమస్యలు పరిష్కరించడానికి ఈనెల 8 నుంచి 8 రోజుల పాటు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తునట్లు తహసీల్దార్ సుబ్బారావు తెలిపారు. 8న రావూడి 12న మధూడి 13 నరసింభూది, ఎ కె డి హళ్లి హాబిటేషన్ గ్రామాలు నరసింభూది గ్రామసచివాలయంలో గ్రామసభ ఉంటుందన్నారు. 14న ఇనగాలూరు, హళ్లికేరాలకు కలిపి 15న పి. బ్యాడిగేరా 19న ఎచ్‌డి హళ్లి, 20న కోడిహళ్లి, ఆర్‌జిహళ్లి, 21న అగళి, ఇరిగేపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామని, భూ సమస్యలు ఉంటే రైతులు ఆధారాలతో గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రైతుల్లో టెక్నాలజీ పెంపొందిస్తాం

విశాలాంధ్ర-చిలమత్తూరు రూరల్: మండల పరిధిలోని కోడూరు పంచాయతీ మొరంపల్లి గ్రామంలో బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీ గౌనివారి పల్లి గోరంట్ల మండలం విద్యార్థినిలు బుధవారం రైతులలో టెక్నాలజీ పెంపొందిం చడమే మా ధ్యేయమంటూ 20 మంది డాక్టర్ అశ్విని ఆధ్వర్యంలో మొరంపల్లి గ్రామంలోని రైతులను సమావేశపరిచారు. వ్యవసాయానికి సంబంధించిన వివిధ రకాల సూచనలు సలహాలను తెలియజేశారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, ఆదినారాయణ, ఆదిమూర్తి, నంజురెడ్డి, పార్వతమ్మ, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

కరవు ప్రాంతంగా ప్రకటించడంపై హర్షం

విశాలాంధ్ర-ముదిగుబ్బ: ముదిగుబ్బ మండలాన్ని తీవ్ర కరువు మండలంగా ప్రభుత్వం ప్రకటించిన సందర్భంగా ముదిగుబ్బ గ్రామపంచాయతీ ఆవరణలో బుధవారం నిర్వహించిన గ్రామ సభలో టీడీపీ ముదిగుబ్బ మండల క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్ బిజెపి మండల కన్వీనర్ సోమల ప్రకాష్ నాయుడులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు టీడీపీ ధర్మవరం నియోజకవర్గం ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇన్పుట్ సబ్సిడీ, పంటల బీమా, పంటల రుణాల రీ షెడ్యూల్, ఉపాధి హామీ పని దినాలను 100 నుంచి 150 వరకు పెంచడం, ఉపాధి హామీ పథకంలో రోడ్లు, కొండ ప్రాంతాల్లో ప్రభుత్వ బీడు భూముల్లో చెట్లు పెంచడం, రైతుల వ్యక్తిగత పొలాల్లో పండ్ల తోటల పెంపకం, నీటి సంరక్షణ కొరకు ఫారం పాండ్స్, పశుగ్రాసం పెంచడం, పశుగ్రాసాన్ని ప్రభుత్వం సబ్సిడీపై అందించడం తదితర ప్రయోజనాలను ముదిగుబ్బ మండలం ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ మంజులాదేవి, సర్పంచ్ లక్ష్మీదేవి చెంద్రాయుడు, తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్, బీజేపీ మండల కన్వీనర్ సోమల ప్రకాష్ నాయుడు సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గోడ పత్రికలు ఆవిష్కరించిన డీఈవో



విశాలాంధ్ర-కొత్తచెరువు: భారతీయ విజ్ఞాన మండలి ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించే కౌశల్ ప్రతిభ అన్వేషణ పోటీల గోడ పత్రికలను డీఈఓ కార్యాలయం వద్ద డీఈవో కిష్టప్ప బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ శాస్త్రవేత్తలు ప్రపంచానికి అందించిన సేవలు ఆవిష్కరణలను విద్యార్థులకు తెలియజేయుటకు ఈ సమస్త నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రతి పాఠశాల నుండి 8, 9 10వ తరగతి చెందిన విద్యార్థుల పేర్లు నవంబర్ 15వ తేదీ లోపల వారి వెబ్‌సైట్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. జిల్లాలోనే ప్రతి పాఠశాల నుండి ఫిజ్జు పోటీలకు తరగతులకు ముగ్గురు చొప్పన తొమ్మిది మందిని ఎంపిక చేయాలన్నారు. నవంబర్ 20, 21, 22వ తేదీలలో ఆన్లైన్లో పోటీలను నిర్వహిస్తామన్నారు.. విజేతలకు మొదటి బహుమతికి 4,500 ద్వితీయ బహుమతికి 3 వేలు బహుమతి అందజేస్తామన్నారు. జిల్లా సైన్స్ అధికారి తనూజ్ కుమార్, కౌశల్ రాష్ట్ర సమన్వయకర్త మనోహర్ శ్రీనివాస్ నాయక్, కౌశల్ కోఆర్డినేటర్ భాస్కర్, అదనపు కోఆర్డినేటర్ పవన్‌కుమార్, ఏడీలు్ పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర-రొళ్ళ: బాలల హక్కుల పరిరక్షణ కోసం సమాజంలో ప్రతి ఒక్కరూ అవగాహన కలిగివుండాలని ఆర్డిటి మహిళా విభాగం టీం లీడర్ ఆదినారాయణ, ఎంఈఓ శ్రీధర్, ఐసిడిఎస్ సూపర్వైజర్ సన్నమ్మ పేర్కొన్నారు. బుధవారం కాకి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్డిటి మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రొళ్ల మండలాన్ని బాల్య వివాహాలు లేని మండలంగా తయారు చేయడానికి ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలన్నారు.ఎవరైనా బాల్య వివాహాన్ని చేసినా ప్రోత్సహించినా హాజరైనా శిక్షార్హులు అవుతారని, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా పని చేసినపుడే బాల్య వివాహ వ్యవస్థను రూపుమాపవచ్చని తెలిపారు. ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, ఏ.ఎన్.ఎంలు పాల్గొన్నారు

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

విశాలాంధ్ర-కొత్తచెరువు: జాతీయస్థాయి ఫుట్బాల్ పోటీలకు కొత్త చెరువులోనే శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి సాయి త్రినేష్ గౌడ్, ఎంపిక అయ్యాడని వైస్ ప్రిన్సిపల్ బాలకృష్ణ, తెలిపారు. గత నెలలో హిందూపురంలో ఎంజీఎం గ్రౌండ్లో జరిగిన అండర్ 14 రాష్ట్రస్థాయి పోటీలలో జాతీయ స్థాయికి ఎంపిక అయ్యారు అన్నారు.

వైసిపీ పాలనలో వ్యవస్థలు కుప్పకూలిపోయాయి..

ఉచిత ఇసుక విధానాన్ని నీరుగారిస్తే ఉపేక్షించను ..

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

విశాలాంధ్ర-కదిరి: వైసీపీ పాలనలో వ్యవస్థలన్ని కుప్ప కూలిపోయాయని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానానికి ఎవరైనా తూట్లు పొడవాలని చూస్తే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. ప్రతి ఒక్క పేదవారికి మంచి జరగాలని సదుద్దేశంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి సీనరైజ్ ద్వారా 260కోట్లు ఆదాయాన్ని వదులుకొని ఎంతో ప్రతిష్టాత్మకంగా ఉచిత ఇసుక విధానాన్ని తీసుక వచ్చారని తెలిపారు. ఇకపై ట్రాక్టర్ ఇసుక కేవలం రూ. 3500 (రవాణా ఖర్చులు)మించి అమ్మిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అధిక ధరలకు అమ్మితే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. పట్టణ సమీపంలో సున్నపుగుట్ట తాండ సర్వేనెంబర్ 470,479, 462 2018లో 70 మందిగాను 27 మంది స్థానికులకు ఇచ్చి, మిగిలిన 43 పట్టాలను ఎక్కడ ఉంటారో ఏం చేస్తుంటారు తెలియని వారికి ఇచ్చి రాజకీయ ముసుగులో పలువురిని మోసం చేశారని ఇలాంటి మోసపూరిత రాజకీయ నాయకులకు ఇప్పటికే ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. గతంలో రాజకీయ ముసుగులో చేసిన అవినీతి అక్రమాలు చేసిన ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు.

అభివృద్ధిలో కూటమి ప్రభుత్వం విఫలం

మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్

విశాలాంధ్ర-గోరంట్ల: కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు గడుస్తున్న ఎలాంటి హామీలు నెరవేర్చలేదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేవలం బూటకపు హామీలతో సూపర్ సిక్స్ అంటూ ఎలాంటి పథకాలు అమలు చేయడంలో అసలు కూటమి ప్రభుత్వమే విఫలమైందని మాజీ మంత్రి, శ్రీ సత్య సాయి జిల్లా వైసీపీ అధ్యక్షురాలు ఉషా శ్రీ చరణ్ ఆరోపించారు, బుధవారం గోరంట్ల మండల కేంద్రంలో మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్, స్థానిక వైసిపి నాయకుల సమక్షంలో వైసిపి కార్యాలయాన్ని ప్రారంభించి అనంతరం మాట్లాడారు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలలోనే ప్రజల నుండి వ్యతిరేకత ఏదుర్కుంటోందని, సాక్షాత్తు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణే కూటమి ప్రభుత్వంపై పెదవి విరుస్తున్నారని, అమ్మఒడి, ఉచిత బస్సు లాంటి పథకాలు ఏమయ్యాయని, స్థానిక మంత్రిగా ఉన్న సవిత బిసిలకు పింఛన్‌లు ఇప్పించిందా, మద్యం షాపులను మంత్రి భర్త ప్రారంభించడం ఏంటని ఎద్దేవా చేసారు, రాబోయే రోజులలో వైసిపి ప్రజల అభిమానం చూరకొంటుందని, జగనన్నను మళ్ళీ సియం చేసుకుంటామని తెలిపారు. సోషియల్ మీడియాలో పని చేస్తున్న జగనన్న సైన్యాన్ని నేను కాపాడుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పిటీసి జయరాంనాయక్,కన్వీనర్లు మేదర శంకర, వీరనారాయణరెడ్డి, గోరంట్ల ఉప సర్పంచు రాజారెడ్డి, సోమందేపల్లి మండల జెడ్పిటీసీ అశోక్,రమాకాంత్‌రెడి, సర్పంచు అంజినాయక్, గోవిందమ్మగారీ శ్రీనివాసులు, రెడ్డి చెరువుపల్లి మంజూనాథ్ పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్‌కు ఐదు వాల్ ఫ్యాన్లు అందజేత

విశాలాంధ్ర-హిందూపురం : పట్టణంలో పాత్రికేయులకు కేటాయించిన ప్రెస్ క్లబ్ భవనం అభివృద్ధి కోసం తన వంతుగా, బిజెపి రాష్ట్ర నాయకుడు మేడుకుర్తి హరి (విలేకరులు అడిగిన తక్షణం) బుధవారం ఐదు వాల్ ఫ్యాన్లు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రామాంజికి అందించారు. త్వరలో సీసీ కెమెరాలు కూడా బహుకరిస్తానని మేడుకుర్తి హరి విలేకరు లకు తెలిపాడు. మేడకుర్తి హరికి పాత్రికేయులు పూలమాలతో సత్కరించి, వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి

తండ్రికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-పెనుకొండ: పిఈటి రమేష్, తన కూతురు సాయి భవిత ధర్మవరం నుంచి పెనుగొండకు వస్తుండగా గుటూరు సమీపాన కనుమ వద్ద వెనకనుంచి బొలెరో వాహనం ఢీకొట్టగా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు, వెంటనే గుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు, మెరుగైన వైద్యం కోసం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు, సాయి భవిత చనిపోయిందని డాక్టర్లు నిర్ధారించారు అమ్మాయి 10వ తరగతి శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో చదువుతున్నది అమ్మాయి, తండ్రి ఇద్దరు కలిసి రాష్ట్రస్థాయి హాకీ పోటీలో పాల్గొనడానికి నెల్లూరు వెళ్లారు, అక్కడ 3,4,5, తేదీలలో పోటీలలో పాల్గొని జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. అనంతరం మీరు సొంత ఊరు ధర్మారంలో శివానగర్‌లో ఉండి, బుధవారం ఉదయం పెనుకొండకు రావడానికి బైక్‌లో బయలుదేరగా మార్గమధ్యంలో ఈ సంఘటన జరిగింది, రమేష్ ను మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు, కియా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆర్‌డీటీ ఆధ్వర్యంలో నూతన గృహ ప్రారంభోత్సవాలు

విశాలాంధ్ర-గుడిబండ: గుడిబండ మండలంలోని కె.జి.ఎన్.పాళ్యం గ్రామంలో ఆర్‌డి టి సంస్థ సహకారంతో 29 ఇండ్ల నిర్మాణం జరిగింది. వీటికి బుధవారం నూతన గృహ నిర్మాణం ప్రారంభోత్సవాల కార్య క్రమం నిర్వహించామని ఏటీఎం మీనాక్షి తెలిపారు. స్పెయిన్ దేశానికి చెందిన 9మంది దాతల మిత్ర బృందంతో కలిసి ఆర్డిటి రీజినల్ డైరెక్టర్ మల్లికార్జున చేతుల మీదుగా ఇళ్లను ప్రారంభోత్సవం చేశారు. జీవితంలో ఇల్లు అనేది ఒక కల నెరవేర్చినందుకు చాలా సంతోషంగా ఉందని ఇల్లు అనేది ఒక భద్రతను ఇస్తుందని సమాజంలో విలువ గౌరవం పెంచుతుందని పిల్లలను మంచి ఉన్నత విద్యాభ్యాసం చేయించి ప్రయోజకులను చేయాలని స్పెయిన్ దేశస్తులు బృందం తెలిపిం దన్నారు. అనంతరం స్పెయిన్ బృందాన్ని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ డైరెక్టర్ మల్లికార్జున, ఏరియా కోఆర్డినేటర్ మీనాక్షి, రొళ్ల ఎటిఎం ఓబులేష్, ఎస్‌టిఎల్ అనసూయమ్మ, ఆర్డిటి సిబ్బంది శ్రీరాములు, కుళ్లా యమ్మ, రంగనాయకులు, ఇంజనీర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

ఏపీ ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర పొలిటికల్ చైర్మన్‌గా పెనుజూరు జూరు నాగరాజు ఎంపిక

విశాలాంధ్ర-ధర్మవరం: ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య యువజన సంఘంలో ధర్మవరం పట్టణానికి చెందిన మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పెనుజూరు నాగరాజును రాష్ట్ర పొలిటికల్ చైర్మన్గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్యవైశ్యుల నాయకుల ఆశీస్సులతో తనకు ఈ పదవి రావడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఆర్యవైశ్య యువజన సంఘం అభివృద్ధికి సమస్యలను పరిష్కరించడంలో అహర్నిశలు పాటుపడతానని తెలిపారు. నన్ను చైర్మన్‌గా ఎన్నుకున్నందుకు ఏపీ ఆర్యవైశ్య మహాసభ, మాజీ మంత్రులు టీజీ వెంకటేషుకు, ఏపీ ఆర్యవైశ్య యువజన సంఘం శబరి వరప్రసాద్‌కు, ఏపీ జిల్లాలలోని ఆర్యవైశ్య యువజన సంఘం కమిటీ కు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. తదుపరి వారు కర్నూల్ లోని చైర్మన్, ఏపీ ఆర్యవైశ్య మహాసభ- మాజీ మంత్రి టీజీ వెంకటేశును ఘనంగా సన్మానించి, ఆశీస్సులను పొందారు. ఈ సందర్భంగా ఈనెల 24వ తేదీ ఆదివారం ఉదయం 10:30 గంటలకు కేటీఆర్ కన్వెన్షన్ హాల్,గుత్తి రోడ్-అనంతపురంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారము, అభినందన సభ నిర్వహిస్తున్నందున, ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొని ఆశీస్సులు ఇవ్వాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలి



విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని సిద్దయ్యగుట్టలో వెలిసిన శ్రీ లక్ష్మినరసింహ స్వామి ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని బుధవారం ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు సంకారపు జయశ్రీ తెలిపారు. ఆలయ కమిటీ సమావేశంలో ఆలయ నిర్మాణం త్వరితగతిన చేపట్టేందుకు చర్చలు నిర్వహించామని తెలిపారు. ధర్మవరంలో దాతలకు కొదవలేదని, 6 కోట్ల వ్యయంతో ఈ ఆలయ నిర్మాణం చేపట్టదలిచామని తెలిపారు. దాతలు ఎవరైనా ధన రూపేనా, వస్తు రూపేనా సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. దాదాపు 300 సంవత్సరాల పైన ఈ ఆలయం అతి పురాతనమైన ఆలయం అని, మహిమ గల దేవుడు అని తెలిపారు. 2025లో నాటికి గుడి నిర్మాణం పూర్తి చేయదలిచామని తెలిపారు. కార్యక్రమంలో పుట్లూరు నరసింహులు, గడ్డం పార్థసారథి, కలవల మురళీధర్, అంబటి అవినాష్, ఓవి ప్రసాద్, అంజలి కృష్ణ, బాలగంగాధర్ తిలక్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి కేహెచ్.ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి కె.ధనుష్ ఎంపిక

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని స్థానిక కె. హెచ్.ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న కొమందూరు ధనుష్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్, జాతీయ సమైక్యత శిబిరా నికి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్, డాక్టర్. కె.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ధనుష్‌ను అధ్యాపకు లు, అధ్యాపకేతర సిబ్బంది, కళాశాల విద్యార్థులు అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ధనుష్ "గుజరాత్ రాష్ట్రంలోని హేమచంద్రాచార్య నార్త్ గుజరాత్ యూని వర్సిటీ, పటాన్‌లో నవంబర్ 8 నుంచి 14వ తేదీ వరకూ జరిగే జాతీయ సమైక్యతా శిబిరంలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డా.బి.గోపాల్ నాయక్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ హాకీ పోటీలకు జీవన జ్యోతి పాఠశాల విద్యార్థి ఎంపిక

విశాలాంధ్ర-ధర్మవరం: గత నెల 23 వ తేదీన అనంతపురం ఆర్డీటి స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ హాకీ పోటీలో ధర్మవరం జీవన్ జ్యోతి స్కూల్ విద్యార్థి యస్.విక్కీ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి ఎస్.జి.ఎఫ్ అండర్14 హాకీ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల హెడ్ మిస్టర్ సిస్టర్ సుజాత తెలియ జేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి ఈనెల 8వ తేదీ నుంచి 10 వ తేది వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో నక్కపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీలలో అనంతపురం జిల్లా తరపున పాల్గొంటారు అని తెలియజేశారు ఎపికైన విద్యార్థిని పాఠశాల హెడమిస్టర్ సిస్టర్ సుజాత, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు శుభాకాంక్షలు తెలియజేశారు.

రసవత్తంగా ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పోలీసులకు, విలేకరులకు ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ రసవత్తంగా కొనసాగింది. ఈ క్రికెట్ మ్యాచ్ సందా రాఘవ ఆధ్వర్యంలో నిర్వహించారు. బ్యాటింగ్ విభాగంలో వన్టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ వీరోచిత ఇన్నింగ్స్ వేశారు. టిడిపి సీనియర్ నాయకులు కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షులు పరిశే సుధాకర్, జింకా పురుషోత్తంలు క్రికెట్ ఆడే సభ్యులతో పరిచయ కార్యక్రమం అనంతరం పోలీస్ జట్టు టాస్ గెలిచి మొదటి బ్యాటింగు ఎంచుకోవడం జరిగింది. మొదటి ఓవర్‌లోనే సీఐ అవుటు కాగా, పోలిసు జట్టు 14 ఓవర్లో 155 పరుగులు మూడు వికెట్లను కోల్పోయింది. అత్యధికంగా సిఐ నాగేంద్రప్రసాద్ 65 పరుగులతో ఇస్మాకు 42 పరుగులతో రాణించారు. తదుపరి బ్యాటింగ్ దిగిన ప్రెస్క్లబ్ జట్టు మొదటి నాలుగు ఓవర్లో బాగా రాణించినప్పటికీ జట్టులో నిలకడగా బ్యాటింగ్ చేయకపోవడం వలన 14 ఓవర్లో 97/7 వికెట్లను సమర్పించింది. విలేఖరి శంకర్ 38 పరుగులతో రాణించినప్పటికీ ఓటమిపాలు అయ్యారు. పోలీస్ జట్టు 58 పరుగులతో విజయం సాధించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు వన్టౌన్ సిఐ నాగేంద్రప్రసాద్ కు దక్కింది. తదుపరి మ్యాచ్లో నందా రాఘవ టీం పాల్గొంది. మొదటి బ్యాటింగ్ చేసిన మున్సిపాలిటీ 99 పరుగులు చేసింది. రెండవ బ్యాటింగ్ చేసిన సంద రాఘవ టీం నూరు పరుగులు సాధించింది. అన్నం సాయినాథ్ 54 పరుగులతో విజయంతో కీలకపాత్ర వహించారు. మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, సందరాఘవ, ఎన్‌డిఏ నాయకులు విజయ్ తెలియని వారిని అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యనిర్వాహకులుగా భరతు, అన్నం సాయినాథ్, ఫయాజ్ పాల్గొన్నారు.

పట్నం ఎస్సైగా కె.రాజశేఖర్

విశాలాంధ్ర-ముదిగుబ్బ: బుధవారం పట్నం ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న నరసింహులు తలుపులకు బదిలీ కాగా అతని స్థానంలో నూతన ఎస్సైగా రోళ్ళ మండలం నుండి బదిలీపై ఇక్కడికి వచ్చి ఎస్సై కె.రాజశేఖర్ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, గురువారం 07, నవంబర్ 2024

పట్టపగలే యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా..!

- అక్రమంగా ఇసుకను దోచుకొని సొమ్ము చేసుకుంటున్న నాయకులు,!
- అడ్డుకోలేక పోతున్న అధికారులు
- నాయకులే ఇసుకాసురులు
- శింగనమన మండలంలో అక్రమార్కుల ఆగడాలు

విశాలాంధ్ర-శింగనమల : శింగనమల మండలంలో అక్రమ ఇసుక రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది, ఉచిత ఇసుక రవాణా చేపడతామని చెబుతున్నా నాయకులు వినకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాటలను నాయకులు పక్కన పెట్టి అక్రమంగా ఇసుకను అమ్ముకుని సొమ్ము కూడబెట్టుకుంటున్నారు, శింగనమల మండలం జలాలపురం, జూలా కాలువ గ్రామాలలో ఏర్లు, వాగులు, వంకలు, ఎటువడితే అటు పట్టపగలే ట్రాక్టర్లు, టిప్పర్లతో ఇసుకను అక్రమార్కులు తరలిసస్తూ, డబ్బులను రాశుల కుప్పలు పోసుకుంటున్నారు. ఇదేమని ప్రశ్నించే వాళ్ళపై దౌర్జన్యం చేస్తున్నారు. అక్రమార్కుల ఆగడాలకు అంతే లేకుండా పోతున్నది. గత మూడు రోజుల నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వీడియోలు చక్కర్లు కొడుతున్నా! ఇంత తతంగం జరుగుతున్నా, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. మొదట్లో హడావుడి చేసిన అధికారులు ఇప్పుడు నిస్సహాయ స్థితిలో ఉన్నారని, ప్రజలు గుసగుసలాడుతున్నారు. టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా యథేచ్ఛగా హైవే రోడ్లపై అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ, మాదే రాజ్యం అంతా మా ఇష్టం మమ్మల్ని ఎవరూ ఏమీ చేసుకోలేరు, అంటూ కొంతమంది పలుకుబడి కలిగిన నాయకులు, పై స్థాయి నుండి అధికారులపై ఒత్తిడి తెస్తున్నందువల్ల, యథేచ్ఛగా అక్రమ ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని, అక్రమ ఇసుక రవాణా దారులను అరికట్టే నాథుడే లేకుండా పోయాడని ప్రజలు వాపోతున్నారు, ఒక్కో టిప్పర్ ఇసుక దాదాపుగా 9000 రూపాయల నుండి 12 వేల రూపాయల వరకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారని, నాయకుల అక్రమ సంపాదనే ధ్యేయంగా ఇసుక వ్యాపారం కొనసాగిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొదట్లో పోలీసులు హడావిడి చేసి టిప్పర్లను ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి జరిమానాలు విధించారని, అయితే ఇప్పుడు అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్నా అటువైపు చూడకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటో ? ఇప్పటికైనా అధికారులు ఇసుకాసురులపై కఠిన చర్యలు తీసుకొని అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ చేయూతను అందిపుచ్చుకుని మహిళలు ఎదగాలి

కలెక్టర్ వినోద్ కుమార్

విశాలాంధ్ర-అనంతపురం: మహిళలు బాగా చదువుకోవాలి.. ఉద్యోగాలు చేసి వారి కాళ్ళపై స్వశక్తితో నిలబడాలని, ప్రభుత్వ కార్యక్రమాలను అందిపుచ్చుకోవడంలో వారు ముందుండాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం అనంతపురం రూరల్ పరిధిలోని పంగల్ రోడ్‌లో ఉన్న టీటీడీసీ కేంద్రంలో నిర్వహించిన ప్రశాంతి జిల్లా పరస్పర సహాయ సహకార సంఘాల ఫెడరేషన్ లిమిటెడ్ 20వ వార్షిక మహాసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా దుతూ రాష్ట్రంలోనే కాకుండా దేశంలో స్వయం సహాయక సంఘాల మహిళలతో మండల, జిల్లా సమైక్యలు ఏర్పాటు చేయడం, అందులో మహిళా సభ్యుల్ని సభ్యులుగా చేయడంలో అనంతపురం జిల్లా ముందుందని, ఇందుకు చాలా గర్వ కారణంగా ఉందన్నారు. ప్రశాంతి జిల్లా సమైక్య ఏర్పాటై 20 సంవత్సరాలు పూర్తయింది అంటే గర్వకార ణంగా ఉందన్నారు. ఎంతో నిబద్ధత, చిత్తశుద్ధితో పనిచేసి ఈ స్థాయిలో నిలవడం ఎంతో గొప్ప విషయం అని, ఇది ఇలాగే ముందుకెళ్లాలని, ఇందుకు స్వయం సహాయక సంఘాల సభ్యులకు కావాల్సిన సహాయ సహకారాలు అధికారులు అందించాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాని కోసం స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణాలు అందించడంలో జిల్లా ముందుండాలన్నారు. అనంతరం కలెక్టర్‌ను ప్రశాంతి జిల్లా సమాఖ్య తరఫున సంఘాల సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి ఈశ్వరయ్య, ఐసిడిఎస్ పిడి బిఎన్ శ్రీదేవి, ప్రశాంతి జిల్లా సమైక్య అధ్యక్షురాలు శేకున్ బి, ఉపాధ్యక్షురాలు సుజాత, రెడ్ సంస్థ ప్రతినిధి భానుజా, కార్యదర్శి రాధ పాల్గొన్నారు.

ఆలయం అభివృద్ధి కోసం రూ.80 వేల విరాళం

విశాలాంధ్ర-శెట్టూరు: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధి కోసం కళ్యాణదుర్గం వైసీపీ నాయకుడు మాదినేని ఉమామహేశ్వర నాయుడు. బుధవారం ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో రూ.80 వేల విరాళం అందజేశారు. ఈనెల 11న ఆంజనేయ స్వామి దేవాలయ నిర్మాణ పూన ప్రారంభ కార్యక్రమానికి ఆహ్వానించారు. అనంతరం ఆలయం అభివృద్ధికి సహకరించాలని కోరగా స్పందించిన తక్షణమే రూ.80వేలు విరాళం అందించారు. భవిష్యత్తులో కూడా ఆలయ అభివృద్ధి కోసం సహ కారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో తలారి సత్తి, ఆలయ కమిటీ సభ్యులు కేశవరెడ్డి, సోమనాథ్‌రెడ్డి, బోయ తిప్పే స్వామి, ఎమ్మెస్ రాయుడు పాల్గొన్నారు.

పచ్చని చెట్లతో ఆక్సిజన్ మెండు

విశాలాంధ్ర-రాప్తాడు: పచ్చని చెట్లను ప్రాణంగా చూసుకుంటే మానవాళి ఊపిరి పీల్చుకునేందుకు ఆక్సిజన్‌ను మెండుగా విడుదల చేస్తాయని ప్రకృతి ప్రాజెక్టు నిర్వాహకురాలు, వర్ష హాస్పిటల్ ఎండీ డాక్టర్ సుప్రజ చౌదరి అన్నారు. బుధవారం రాప్తాడు ప్రాథమిక ఆరోగ్య ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శివకృష్ణ ఆధ్వర్యంలో రాప్తాడు సర్పంచ్ సాకే తిరుపాలుతో కలిసి మొక్కలు నాటారు. రోజు నీళ్ళుపోసి వృక్షాలుగా పెరిగే వరకు జాగ్రత్త ఇస్తే భవిష్యత్తులో మంచి ఫలితాలు పొందవచ్చు అన్నారు. ప్రతి ఇంటి ముందు, పరిసరాలలోనూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్ బాబు, ఫార్మసిస్టు మూర్తి, సూపర్వైజర్ నరసింహ, ఎం.ఎల్. హెచ్.పీ గోపాల్, ఏఎన్ఎం అనిత పాల్గొన్నారు.

టేకులోడులో పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర-చిలమత్తూరు రూరల్: మండల పరిధిలోని టేకులోడు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయ అధికారి వంశీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రామసుబ్బయ్య, పుట్టపర్తి డాట్ సెంటర్ వ్యవసాయ శాస్త్రవేత్త వారు పాల్గొన్నారు. రైతులకు మొక్కజొన్న, వేరుశెనగ, కంది పంటల యాజమాన్య పద్ధతులను క్షుణ్ణంగా తెలిపారు. ప్రధానంగా మొక్కజొన్నలో కత్తెరపురుగు, నిలువు తెగుళ్ళ నివారణకు పంట మార్పిడి చాలా ముఖ్యం అని తెలిపారు. కత్తెర పురుగు నివారణకు ఇమమేక్టిన్ బెంజోయేట్ ఏ 80 గ్రాములు ఎకరాకి వాడాలి. నిలువు తెగులు తగ్గదలకు దుక్కి చేసే సమయంలో ట్రైకోడర్మా విరిడేను పశువుల పేడ కలిపి ఎకరానికి 100 కిలోలు వేసుకోవాలి లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్ (బ్లాయిటాక్స్) - 600 గ్రాములు/ఎకరానికి దుక్కి సమయంలో వేసుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ స్టాఫ్ వారు ఘన జీవామృతం, ద్రవ జీవామృతం తయారీ విధానం, వాటి ఉపయోగాల గురించి వివరిం చారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సహాయకురాలు అశ్విని, ప్రకృతి వ్యవసాయ సిబ్బంధి, టకులోడు గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై పని ఒత్తిడి తగ్గించాలి

విశాలాంధ్ర-పుట్టపర్తి : ఉపాధ్యాయులపై ప్రభుత్వం పని ఒత్తిడి పెంచడం భావ్యం కాదని అదనపు పనులు తగ్గించాలని జిల్లా వైయస్సార్ ఉపాధ్యాయుల అసోసియేషన్ అధ్యక్షుడు పి.వి. రమణారెడ్డి, నాయకులు సుబ్బారెడ్డి, మధుసూదన్ రెడ్డి, వాసు, చిదాంబర్ రెడ్డి బుధవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. పర్మనెంట్ ఐడి నెంబర్(అపార్) నమోదు చేయాలని ఉపాధ్యాయులపై ప్రభుత్వం ప్రభుత్వం ఒత్తిడి పెట్టిందని, ఆధార్‌లో ఒక రకంగా విద్యార్థుల రిజిస్టర్లో ఇంకొక రకంగా నమోదు కావడంతో వాటిని ఎప్పటికప్పుడు పంపలేక పోతున్నామన్నారు. వీటి నమోదుకు అవసరమైన ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. దీంతో ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడికి గురవుతూ ఉన్నారని పలు యాప్‌ల నుంచి ఉపాధ్యాయులను విముక్తి చేయాలని కోరారు. అలాగే వీలైనంత త్వరగా వేతన, సవరణ, అమలు అయ్యేలోగా మధ్యంతర భృతితో పాటు పెండింగ్‌లో ఉన్న కరువు బత్యం బకాయిలను వెంటనే విడుదల చేయాలని అలాగే చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న పిఆర్‌సి బకాయిలు, ఆర్జిత సెలవుల బకాయిలు విడుదల చేసి ఉపాధ్యాయుల నమ్మకాన్ని వమ్మో చేయకుండా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. అపాంర్‌ను మరింత సరళీకృతం చేయాలని వారు కోరారు.

చాకల నారాయణప్ప గడ్డివాముకు నిప్పు

-మంత్రి ఆదేశాలతో 20 వేల ఆర్థిక సహాయం

విశాలాంధ్ర,గోరంట్ల .. మండలం లోని మల్లాపల్లి పంచాయతీ పరిధిలోని బుగానపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త చాకల నారాయణప్ప గడ్డివాము ను నిన్నటి రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు,ఈవిషయం రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం, చేనేత జౌళి శాఖ మంత్రి సవితమ్మ దృష్టి కి చరవాణి ద్వారా చాకలి నారాయణప్పని పరామర్శించారు, మంత్రి సవితమ్మ ఆదేశాల మేరకు గోరంట్ల మండల టీడీపీ నాయకులు చాకలి నారాయణప్ప కుటుంబాన్ని పరామర్శించి వారికి రూ.20 వేల ఆర్థిక సహాయంను అందజేశారు, ఈ కార్య క్రమంలో టిడిపి మండల కన్వీనర్ సోమశేఖర్, పట్టణ కన్వీనర్ రఘునాథ్ రెడ్డి, బాలకృష్ణ చౌదరి, ఉత్తమ రెడ్డి, నరేష్ కుమార్, నిమ్మల శ్రీధర్,చంద్ర, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గిరిధర్‌గౌడ్, అజ్మతుల్లా, మల్లాపల్లి మొహమ్మద్, వెంకటరెడ్డి, అశ్వర్థప్ప, సోమశేఖర్, సుబ్రమణ్యం, కిషోర్ రాయల్, దేవానంద్ పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన జిఎం శేఖర్

విశాలాంధ్ర,గోరంట్ల .. మండలంలోని గంగంపల్లికు చెందిన వైసీపీ నాయకులు నాగభూషణం రెడ్డి కుమార్తె వివాహం పట్టణంలోని రాజ్ ఫంక్షన్ హాల్ నందు బుధవారం ఉదయం సత్యసాయి జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజక వర్గం నాయకులు బొట్టు శ్రీనివాసులు, మండల అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, వెంకటాచలం,లక్ష్మీ నారాయణ, శంకర,షబ్బీర్,గంగాధర్,అశోక్,శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

విశాలాంధ్ర-రాప్తాడు: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని రైతు సాధికార సంస్థ రాష్ట్ర అధికారి సురేష్, మండల టీమ్ లీడర్ భూపాల్‌రెడ్డి సూచించారు. మరూరు క్లస్టర్లోని గ్రామాల్లో ప్రకృతి వ్యవ సాయం పై కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. రైతులు రసాయనాలపై ఆధారపడకుండా, పూర్తిగా ప్రకృతి సహజ పద్ధతుల్లో పంటలను సాగు చేయాలన్నారు. వ్యవసాయంలో మంచి లాభాలు చేకూర్చడానికి దేశీయ ఆవు పేడ, మూత్రంతో తయారుచేసిన ఘన జీవామృతం, ధ్రవజీవామృతం ద్వారా, మొక్కల నుండి లభించే దినుసులను ఉపయోగించి కాషాయాలు తయారు చేయిస్తూ పంటలపై వినియోగించాలన్నారు. రైతులు పలు నమూనా పంటలు, పాలిక్రాపింగ్ మిశ్రమ సాగు విధానాలను అనుసరిస్తూ ఈ ప్రాంత రైతులు మంచి ఫలితాలను సాధిస్తున్నారన్నారు. దీని ఫలితంగా నేల ఆరోగ్యం మెరుగువడటంతో పాటు రైతుల ఆదాయం కూడా పెరుగుతోందన్నారు.

మరుగుజ్జుల సంఘం నాయకుడు మద్దిలేటి మరణం సంఘానికి తీరని లోటు

విశాలాంధ్ర-కూడేరు: మరుగుజ్జుల సంఘం నాయకుడిగా మద్దిలేటి మృతి తీరని లోటని సంఘం నాయకులు అన్నారు. ఆయన వికలాంగుల సంఘాలలో వికలాంగులతో మమేకమై ఎన్నో ధర్నాలు ఎన్నో రాస్తారోకోలలో పాల్గొన్నారని, ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొనే వాడని వికలాంగుల హక్కుల పోరాటసమితి రాష్ట్ర అధికార ప్రతినిధి ఓ పెద్దన్న అన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు నార్పల విద్యార్థులు ఎంపిక..

విశాలాంధ్ర-నార్పల: 68వ స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో పాల్గొన్న నార్పల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవికుమార్ తెలిపారు. నెట్‌బాల్ అండర్-17 రాంచరణ్, అండర్-14 సాయిమాధవ్, బేస్‌బాల్ అండర్-17 హేమంత్ కుమార్ రెడ్డి, అండర్-14 గురుప్రవీణ్ కుమార్, సాఫ్ట్ బాల్ అండర్-14 మహేష్, హాకీ అండర్-14 మహ్మద్ అవేజ్ రాష్ట్ర స్థాయి పోటీల లో పాల్గొంటున్నారు. పాఠశాల పీడీ ఆంజనేయులు, పిఈటి నసీమ బేగంను విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.రాష్ట్ర స్థాయిలో బాగా ఆడి జాతీయ స్థాయిలో ఎంపిక కావాలని ఆకాంక్షిస్తూ పాఠశాల ఉపాధ్యాయ బృందం క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియచేశారు.

అజితకి పీహెచ్‌డీ ప్రదానం..

విశాలాంధ్ర-జేఎన్టీయూఏ : జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో బి.అజిత డాక్టరేట్ సుదీర్ఘ కాలంగా పరిశోధన చేసినందుకు పీహెచ్‌డీ ప్రదానం చేశారు. సివిల్ విభాగం సీనియర్ ఆచార్యులు ఇంచార్జ్ ఉపకులపతి ఆచార్య హెచ్. సుదర్శనరావు పర్యవేక్షణలో సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో ఏ స్టడీ ఆన్ ది ఎఫెక్ట్ ఆఫ్ ఏ ఎల్ 203 నాను ప్రాక్టికల్స్ ఆన్ వర్కబిలిటీ అంశంపై పరిశోధన పూర్తి చేశారు. అనంతరం అధ్యాపక బృందం, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

వలసల నివారణకు దినపు పని దినాలు

విశాలాంధ్ర-రాప్తాడు : నియోజకవర్గ కేంద్రం రాప్తాడు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడంతో రైతులు, ప్రజలు వలసలు వెళ్లకుండా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద అదనపు పనిదినాలు కల్పిస్తామని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఈసీ మురళి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం మండల వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించారు. ఉపాధి పనులు 2024-25వ సంవత్సరంలో గ్రామాల్లో నిర్వహించబోయే పనులు వాటి గురించి వివరించారు. రైతు కూలీలు ఎవరు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లకుండా వారు ఉన్న గ్రామాల్లోనే ఉపాధిహామీ పథకం ద్వారా ఉపాధి పనులు కల్పిస్తామ న్నారు. టిడిపి నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును పూర్తి చేయండి

విశాలాంధ్ర-చిలమత్తూరు రూరల్: కోడూరు పంచాయతీ మొరంపల్లి గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర బాబు ఆధ్వర్యంలో టిడిపి మండల నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదును త్వరగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. సభ్యత్వ నమోదు పార్టీ నాయకత్వాన్ని కార్యకర్తలను చేరవచేసేందుకు దోహదం చేస్తుందన్నారు ఈ కార్యక్రమంలో కన్వీనర్ రంగారెడ్డి, దేమ కేతేపల్లి అంజనప్ప, బేకరీ గంగాధర్, శ్రీదేవి, వి.లక్ష్మీదేవి, బి.లక్ష్మీదేవి, వేణు, శ్రీనివాస్‌రెడ్డి, స్టూడియో మూర్తి, ఆటో రామంజి, డీలర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర-కూడేరు: మండల పరిధిలోని ముద్దుల పురం గ్రామం ఎస్సీ కాలనీ యందు బుధవారం గ్రామ దేవత అయిన శ్రీ ముత్యాలమ్మ దేవత విగ్రహ ప్రతిష్ట అంగరంగ వైభవంగా నిర్వహించారు. బిల్డెన్ బ్రహ్మశ్రీ జి.రామనాథ శాస్త్రి వేద పండితుల ఆధ్వర్యంలో యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, ఉదయం విగ్రహ అలంకారం, ప్రతిష్ట హెూమములు, చండీ హెూమం, బలి అమ్మవారి దర్శనం మహా మంగళహారతి నిర్వహించారు. మూడు రోజుల నుండి నూతన ఆలయమునందు విశేష పూజలు చేపట్టారు, ఆలయ నిర్మాణం కొరకు ఎస్సీ కాలనీపెద్దలు విరాళాల ద్వారా దాదాపు 75 లక్షల రూపాయలతో ఆలయ నిర్మాణం చేపట్టారు, శ్రీ ముత్యాలమ్మ విగ్రహ దాత అయిన బెల్డోన్ బ్రహ్మశ్రీ జి.రామనాథశాస్త్రిలు అమ్మవారి విగ్రహాన్ని సమర్పించారు, ఆలయం నిర్మాణం కొరకు విరాళాలు అందజేసిన దాతలు వారి కుటుంబ సభ్యులను అమ్మవారి చల్లగా చూడాలని కాలనీపెద్దలు కోరుకున్నారు.

గుత్తి మున్సిపాలిటీలో డయల్ యువర్ కమిషనర్

విశాలాంధ్ర-గుత్తి: మునిసిపాలిటీ పరిధిలో బుధవారం మునిసిపల్ కమిషనర్ బి.జబ్బార్ మియా ఆధ్వర్యంలో డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం నిర్వహించారు. పబ్లిక్ గ్రీవెన్సు ద్వారా వచ్చిన వినతులకు ఫోన్ ద్వారా తెలుసుకున్న సమస్యలు వాటర్ సప్లై,వీధి లైట్స్, డ్రైనేజీ క్లీనింగ్, పారిశుధ్యం వంటి 8 సమస్యల పరిష్కారం కొరకు చర్యలు చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ పి.రాంబాబు, శానిటరీ ఇన్స్ పెక్టర్ మహబూబ్ బాషా, టి.పి.బి.ఓ అప్పస్వామి, ఏ.ఈ రవికుమార్, డి.పి.ఓ. నరేష్ సిబ్బంది పాల్గొన్నారు.

ఛలో ఢిల్లీ, పార్లమెంట్ మార్చ్ జయప్రదం చేయండి..

పిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు మంజుల నరేంద్ర

విశాలాంధ్ర-ధర్మవరం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, అధిక ధరలు తగ్గించాలని పేదరికం నిర్మూలించాలని కోరుతూ రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ, ఆర్ఎస్‌పి, పిఎస్‌యు విద్యార్థి సంఘం సెంట్రల్ కమిటీల ఆధ్వర్యంలో నవంబర్ 28 వ తేది దేశ రాజధాని ఢిల్లీలో జరుగు పార్లమెంటు మార్చ్ కార్యక్రమం జయప్రదం చేయాలని కోరుతూ ధర్మవరం పట్టణంలోని ఐటిఐ కళాశాలలో పోస్టర్ విడుదల చేశారు. అనంతరం మంజుల నరేంద్ర మాట్లాడుతూ 2014లో మేకింగ్ ఇండియా మేడ్ ఇన్ ఇండియా అనిచెప్పి దేశంలో బీజేపీ అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం కోటి ఉద్యోగాలు కల్పించి పేదరికానీ నిర్మూలన చేస్తామని, పేదలకు అందుబాటులోకి తెస్తామని హామీ ఇవ్వడం జరిగింది అన్నారు. కానీ అమలు కాకపోవడం దారుణమని తెలిపారు. అధికారం చేపట్టిన 10 సంవత్సరాలు పూర్తి అయినా ఉద్యోగ కల్పనకోసం ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయకపోగా వున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పి లక్షలాది మంది ఉద్యోగులను రోడ్డున పడే విధంగా చేయడం అన్యాయం అన్నారు. ప్రభుత్వ లెక్కల గణాంకాల ప్రకారం దేశంలో గతంలో ఎన్నడూ లేనంతగా 23.7 శాతము నిరుద్యోగులు ఉన్నారని తెలిపారు.వీటి పైన స్పందించాల్సిన మోడీ ప్రభుత్వం నోరు మెదపక పోవడం దారుణ అన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా వివిధ పరిశ్రమల అభివృద్ధి కోసంగాని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పనకు కానీ కేంద్ర బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించకపోవడం అన్యాయం అన్నారు. దీనివల్ల ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగ యువకులు తప్పుదోవపట్టి అనేక అసాంఘిక కార్యక్రమాలకు బానిసలు అవుతూ తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పన కోసం ధరల నియంత్రణ కోసం పేదరిక నిర్మూలన కోసం పార్లమెంట్ మార్చ్ కార్యక్రమంలో నిరుద్యోగ యువత ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాగ సాయి, ఉదయ్, అభిషేక్ సాయి, చరణ్ పాల్గొన్నారు.

ఎన్ఆర్ఈజీఏస్ కింద కంపచెట్ల తొలగింపునకు హామీ

విశాలాంధ్ర-యాడికి: స్మశాన వాటికకు ఎన్ఆర్ ఈజీఏ కింద కంపచెట్ల తొలగింపు చేస్తామని రెవిన్యూ సిబ్బంది హామీ ఇచ్చారు. యాడికి మండలం సి.లక్ష్మింపల్లి గ్రామానికి చెందిన మాతాకుల పెద్దక్క మంగళవారం రాత్రి మరణించిగా అంత్యక్రియలు నిర్వహించుటకు స్మశాన వాటికకు వెళ్లుదారి కంప చెట్లతో నిండి ఉందని కొందరు షెడ్యూల్ కులల వారు ఆందోళన చేయగా స్థలాన్ని డిప్యూటీ తహశీల్దార్, యస్.ఐ, ఆర్.ఐ, వీఆర్వోలు తనిఖీ చేసి ఎన్ఆర్ఈజీఏస్ కింద కంపచెట్లు తొలగిస్తామని హామీ ఇచ్చిన తరువాత మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

టమోటా పంటకు పంటల బీమా సద్వినియోగం చేసుకోవాలి

పుట్టపర్తి జిల్లా కలెక్టర్ పిఎస్ చేతన్

విశాలాంధ్ర-పుట్టపర్తి : జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి ఉద్యాన పంటల పరంగా టమోటా పంటను కూడా పంటల బీమా పథకంలో ప్రభుత్వం అమలు చేయనున్నదని కలెక్టర్ టీఎస్ చేతన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టమోటా పంటను బీమా చేసే సదుపాయం (ఇఫ్కో - టోక్యో) అనే కంపెనీ అనే కంపెనీ బీమా పథకం అమలు చేస్తుందన్నారు. ఎకరాకు కంపెనీ వారు రూ.32 వేల వరకు పంటల బీమా చేయడం జరుగుతుందన్నారు. ఎకరాకు బీమా ప్రీమియం రూపంలో కంపెనీ వసూలు చేయడం జరుగుతుందని ఇందులో రూ.800లు కేంద్ర ప్రభుత్వం మరో రూ.800లు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని రైతులు తమ వంతు ప్రీమియం రూ.1600లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. బ్యాంకుల నుంచి రుణ గ్రహీత రైతులు అక్టోబర్ నుంచి డిసెంబర్ 15 మధ్యలో రుణ సదుపాయం పొంది ఉంటే బ్యాంకుల ద్వారానే ఇన్సూరెన్స్ చేయబడుతుందన్నారు. బ్యాంకులలో రుణాలు తీసుకొని రైతులు వారే సొంతంగా భీమా చేసుకోవాలి అనుకుంటే డిసెంబర్ 15 లోపల కామన్ సర్వీస్ సెంటర్ లేదా బ్యాంకుల ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు కామన్ సర్వీస్ సెంటర్ డి ఎం వి. పాండురంగారావు 7989690495 గల నెంబర్ కు ఫోను చేసి సంప్రదించవచ్చు అన్నారు. ఒకవేళ ఎవరైనా రైతులు బ్యాంకుల ద్వారా లేదా సొంతంగా బీమా సౌకర్యం పొంది తర్వాతి రోజులలో వారికి పంటల బీమా సౌకర్యం అక్కర్లేదని భావించినట్లయితే అట్టివారు డిసెంబర్ 15 లోపల బ్యాంకుల పని దినాలలో రద్దు చేసుకునే అవకాశం ఉందని కట్టిన ప్రీమియం వెనక్కి ఇవ్వబడుతుందన్నారు. ఒకవేళ రైతులు పంటని మార్చుకోవాలి అనుకుంటే డిసెంబర్ 15 కంటే కనీసం రెండు రోజులు ముందుగానే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అప్పుడు కొత్త పంటకి అవసరమైన ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నల్లమాడను కరువు మండలంగా ప్రకటించాలి...

విశాలాంధ్ర-నల్లమాడ : అతివృష్టి అనావృష్టితో కరువు ఊబిలో కూరుకుపోతున్న నల్లమాడ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సీపీఎం మండల కార్యదర్శి గోవిందు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నాలుగైదు సంవత్సరాల నుంచి వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పంటలు లేక ఇతర రాష్ట్రాలకు వలసలకు వెళ్లాల్సి ఉంది. ప్రస్తుత ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్పందించిన తాహసీల్దార్ రంగనాయకులు ఈ విషయం పై అధికారులకు తెలియజేసి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గంగులప్ప, రామకృష్ణ, ప్రతాప్ తిమ్మప్ప, సుబ్బయ్య, కుల్లయప్ప రైతులు నాయకులు పాల్గొన్నారు.

వలసల నివారణకు ఉపాధి హామీ పనులు చేపట్టండి ..

విశాలాంధ్ర - నార్పల: మండల పరిధిలోని బొందలవాడ గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామసభలో సర్పంచ్ శిరీష, వైస్ సర్పంచ్ అలం వెంకట నరసానాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైస్ సర్పంచ్ అలం వెంకట నరసానాయుడు మాట్లాడుతూ గ్రామ సభలో కరువు నివారణ చర్యలో భాగంగా వలసలు వెళ్లకుండా ఉపాధి హామీ పథకములో కరువు నివారణకు కూలీలకు క్షేత్రస్థాయిలో ఉపాధి పనులను చేపట్టాలని, క్షేత్రస్థాయిలో కొత్త పనులు గుర్తించి, జాబ్ కార్డ్ కలిగి ఉన్న ప్రతి కుటుంబానికి 120 రోజులు పని దినాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నీటి సంరక్షణకు నీటి కుంటలు, చెక్ డ్యామ్‌లు తదితర పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వార్డు మెంబర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఉపాధి కూలీలు, రైతులు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆడపిల్లలను రక్షిద్దాం .. చదివిద్దాం

విశాలాంధ్ర- చిలమత్తూర్ రూరల్: స్థానిక అంగన్వాడి కేం ద్రంలో బుధవారం ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగ మల్లేశ్వరి ఆదేశాలు మేరకు ఆడ పిల్లలను రక్షిద్దాం, ఆడపిల్లలను చదివిద్దాం అనే కార్యక్రమాన్ని సూపర్వైజర్ లలితమ్మ, ఔట్రిచ్ వర్కర్ లక్ష్మీ ప్రసన్న, ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు, వారు మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన, ఆడపిల్లల చదువు, ఆరోగ్యం, ఆహారం లింగ వివక్షత లేకుండా తల్లిదండ్రులు పెంచాలని, బాల్యవివాహాలు జరిగినట్లయితే 1098 నెంబర్ కు ఫోన్‌చేసి తెలపాలన్నారు. కార్యక్రమంలో గర్భవతులు, బాలింతలు, కిశోర బాలికలు, తల్లులు, అంగన్వాడీ కార్యకర్తలు సాహెదా భాను, పార్వతమ్మ, శారదా పాల్గొన్నారు.